జగన్ సీఎం కావాలని వారే కోరుకుంటున్నారు

- అబద్ధాలు చెప్పడం ఆయన రక్తంలోనే లేదు
- వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు కాకాణి గోవర్ధన్‌రెడ్డి
- రూరల్ నియోజకవర్గంలో పోరుబాట
- విద్యుత్ చార్జీలు పెంచనంటూ చంద్రబాబు మాట్లాడిన వీడియో ప్రదర్శన



వైఎస్సార్ విగ్రహానికి నివాళులు

నెల్లూరు(బారకాసు) / నెల్లూరు(వీఆర్సీ సెంటర్): కూటమి ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను చూస్తున్న కరుడుగట్టిన టీడీపీ కార్యకర్తలే తమ పార్టీ అధినేత జగన్‌మోహన్‌రెడ్డి మరోసారి సీఎం కావాలని కోరుకుంటున్నారని మాజీ మంత్రి, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు కాకాణి గోవర్ధన్‌రెడ్డి పేర్కొన్నారు. రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం ప్రజలపై రూ.15 వేల కోట్ల విద్యుత్ చార్జీల భారాన్ని మోపడాన్ని వ్యతిరేకిస్తూ పార్టీ అధినేత జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు పోరుబాట కార్యక్రమాన్ని నగరంలోని కరెంటాఫీస్ సెంటర్‌లో పార్టీ నెల్లూరు రూరల్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆనం విజయకుమార్‌రెడ్డి, కాకాణి ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించారు. తొలుత వైఎస్సార్ విగ్రహానికి నివాళులర్పించారు. మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్ మృతికి సంతాపాన్ని తెలుపుతూ రెండు నిమిషాలు మౌనం పాటించారు. విద్యుత్ చార్జీలను ఐదేళ్లు పెంచబోమంటూ చంద్రబాబు మాట్లాడిన వీడియోను కాకాణి ఆధ్వర్యంలో ప్రదర్శించారు.

అబద్ధాలు చెప్పడం చేతకాదు

చంద్రబాబు తరహాలో అబద్ధాలు చెప్పడం జగన్‌మోహన్‌రెడ్డికి చేతకాదని కాకాణి గోవర్ధన్‌రెడ్డి పేర్కొన్నారు. అలా వ్యవహరించి ఉంటే జీవితాంతం సీఎం కుర్చీలో జగన్‌మోహన్‌రెడ్డే ఉండేవారని తెలిపారు. అధికారంలోకి వచ్చిన ఆర్నెల్లోనే వేల కోట్ల విద్యుత్ చార్జీల భారాన్ని ప్రజలపై మోపడం దుర్మార్గమన్నారు. విద్యుత్ చార్జీలను తగ్గించేంత వరకు తమ నిరసన కొనసాగుతుందని స్పష్టం చేశారు. రానున్న రోజుల్లో పోరాటాన్ని మరింత ఉధృతం చేస్తామని ప్రకటించారు. ఎస్సీ, ఎస్టీలకు ఇచ్చే ఉచిత విద్యుత్‌కు మంగళం పాడే పరిస్థితి ఏర్పడనుందని ఆందోళన వ్యక్తం చేశారు. తాము చేపట్టిన పోరుబాట కార్యక్రమానికి ప్రజల నుంచి అనూహ్య స్పందన లభించిందన్నారు. గత ప్రభుత్వంలో విద్యుత్ చార్జీలను పెంచారంటూ ప్రజలను టీడీపీ నేతలు మభ్యపెట్టారని, వాస్తవానికి.భారం పడకుండా జగనన్న చర్యలు చేపట్టిన అంశాన్ని గుర్తుచేశారు. గత టీడీపీ ప్రభుత్వంలో విద్యుత్‌ను వ్యాపారంగా మార్చారని.. లాభాపేక్షతో యూనిట్ విద్యుత్‌ను రూ.5.90కు కొనుగోలు చేసిన విషయాన్ని ప్రస్తావించారు.

వంచనకు గురిచేయడం సబబా..?

ప్రజలను నమ్మించి ఓట్లేయించుకొని ఇప్పుడు వంచనకు గురిచేయడం ఎంతవరకు సమంజసమని ఆనం విజయకుమార్‌రెడ్డి ప్రశ్నించారు. చంద్రబాబు పాలన చంద్రబాదుడులా మారిందని దుయ్యబట్టారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయడంలో కూటమి ప్రభుత్వం విఫలమైందని ధ్వజమెత్తారు. అనంతరం విద్యుత్ చార్జీలను తగ్గించాలనే నినాదాలతో విద్యుత్ భవన్ వద్దకు చేరుకున్నారు. అక్కడ గేట్‌కు తాళాలేసి ఉన్నారు. జై జగన్.. జైజై జగన్.. గేట్‌కు తాళా లేయడం సిగ్గో.. సిగ్గు అంటూ పార్టీ నేతలు, కార్యకర్తలు నినాదాలు చేశారు. ఎస్‌ఈ విజయన్ రావడంతో గేట్ తాళాలు తీశారు. అనంతరం ఆయనకు వినతిపత్రాన్ని అందజేశారు. జెడ్పీ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ, పార్టీ మహిళా విభాగ జిల్లా అధ్యక్షురాలు లక్ష్మీసునంద తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కాకాణి గోవర్ధన్‌రెడ్డి, పక్కన విజయకుమార్‌రెడ్డి తదితరులు



విద్యుత్ భవన్ గేట్‌కు తాళాలేయడంతో బయటే నిరీక్షిస్తూ..

బూటకపు హామీలతో గద్దెనెక్కిన బాబు

- మాజీ ఎంపీ ఆదాల ప్రభాకర్‌రెడ్డి
- పెంచిన విద్యుత్ చార్జీలను తక్షణమే ఉపసంహరించాలి
- సిటీ నియోజకవర్గంలో పర్వతరెడ్డి ఆధ్వర్యంలో పోరుబాట
- నల్ల దుస్తులు ధరించి.. ఉరితాళ్లు చేతబట్టి వినూత్న రీతిలో నిరసన



ప్లకార్డులతో ఆదాల ప్రభాకర్‌రెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి తదితరులు

నెల్లూరు(బారకాసు) / నెల్లూరు(వీఆర్సీ సెంటర్): అవసరమైతే విద్యుత్ చార్జీలను తగ్గిస్తామంటూ బూటకపు హామీలిచ్చి చంద్రబాబు గద్దెనెక్కారని మాజీ ఎంపీ, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నెల్లూరు పార్లమెంట్ నియోజకవర్గ పరిశీలకుడు ఆదాల ప్రభాకర్‌రెడ్డి విమర్శించారు. పెంచిన విద్యుత్ చార్జీలను ఉపసంహరించాలంటూ ఎమ్మెల్సీ, పార్టీ నెల్లూరు నగర నియోజకవర్గ ఇన్‌చార్జి పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో నగరంలో పోరుబాట నిరసన కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. తొలుత మినీబైపాస్ రోడ్డులోని మహేశ్వరి, పరమేశ్వరి కల్యాణ మండపం నుంచి పార్టీ శ్రేణులు నల్ల దుస్తులు ధరించి, ఉరితాళ్లు చేతబట్టి.. పెంచిన విద్యుత్ చార్జీలను వెంటనే తగ్గించాలంటూ నినాదాలు చేస్తూ ర్యాలీగా బయల్దేరారు. అనంతరం సమీపంలోని మిలీనియం సబ్‌స్టేషన్ వరకు చేరుకున్నారు.

మరోసారి అబద్ధాలు, మోసాలు

చంద్రబాబు అబద్ధాలు, మోసాలు మరోసారి రుజువవుతున్నాయని, వీటిని ప్రజలు గమనించాలని ఆదాల ప్రభాకర్‌రెడ్డి కోరారు. ప్రతిపక్షంలో ఉంటే ఒకలా.. అధికారంలో ఉంటే మరోలా వ్యవహరించడం ఆయన నైజమని విమర్శించారు. అధికారంలోకి వస్తే చార్జీలను తగ్గిస్తానని హామీ ఇచ్చి మోసగించారని ఆరోపించారు. నవంబర్‌లో రూ.ఆరు వేల కోట్లు, డిసెంబర్‌లో రూ.తొమ్మిది వేల కోట్ల భారాన్ని ప్రజలపై మోపారని ధ్వజమెత్తారు. గత ప్రభుత్వంలో ఉచితంగా 200 యూనిట్లు ఇచ్చారని, ప్రస్తుతం ఆ ఇళ్లకు సైతం ట్రూ అప్ చార్జీల పేరుతో రూ.1500, రూ.రెండు వేల వరకు బిల్లులొస్తున్నాయని చెప్పారు. మాయమాటలు చెప్పే చంద్రబాబుకు ప్రజలు బుద్ధి చెప్పే రోజులు దగ్గర పడ్డాయని స్పష్టం చేశారు.

ప్రజల నడ్డి విరిచారు

అధికారంలోకి వచ్చిన ఆర్నెల్లోనే విద్యుత్ చార్జీలను పెంచి ప్రజల నడ్డి విరిచారని పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి విమర్శించారు. హామీలిచ్చి అధికారంలోకి వచ్చాక అమలు చేయకుండా ప్రజలను మోసం చేశారని ఆరోపించారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ప్రజలకు షాకులపై షాకులిస్తోందని ధ్వజమెత్తారు. సంక్షేమ పథకాలను ఇవ్వకపోగా, ప్రజల నుంచే వసూలు చేసే యత్నాలకు శ్రీకారం చుట్టారని మండిపడ్డారు. పన్నులు వసూలు చేసి, సంపద సృష్టిస్తానని చెప్పడం ఎంతవరకు సమంజసమో ప్రజలే అర్థం చేసుకోవాలని కోరారు. విద్యుత్ చార్జీలపై పోరుబాట కార్యక్రమాన్ని మాజీ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి నాయకత్వంలో నిర్వహించామన్నారు. దేశ చరిత్రలో కరెంట్ చార్జీల రూపంలో రూ.15 వేల కోట్లకుపైగా భారాన్ని మోపిన ఘనత చంద్రబాబుకే దక్కుతుందని ఎద్దేవా చేశారు. అనంతరం మిలీనియం సబ్‌స్టేషన్లో ఎస్‌ఈకి వినతిపత్రాన్ని అందజేశారు. కార్పొరేటర్లు, పార్టీ అనుబంధ విభాగాల జిల్లా అధ్యక్షులు, నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.



మిలీనియం సబ్‌స్టేషన్ వద్దకు భారీ ర్యాలీగా వెళ్తూ..



ఎస్‌ఈకి వినతిపత్రాన్ని అందజేస్తున్న ఆదాల, పర్వతరెడ్డి, ఖలీల్



వినూత్న రీతిలో నిరసన తెలియజేస్తూ..

క్లుప్తంగా

అగ్నికుల క్షత్రియుల సమావేశం రేపు

నెల్లూరు(బృందావనం): నవాబుపేటలోని ధర్మరాజస్వామి దేవస్థానంలో అగ్నికుల క్షత్రియ సంఘీయుల సమావేశాన్ని ఆదివారం నిర్వహించనున్నామని దేవస్థాన చైర్మన్ సాదా నాగయ్య, మాజీ అధ్యక్షుడు నగిరి చంద్రశేఖర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. సమావేశానికి హాజరుకావాలని కోరారు.

మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి

నెల్లూరు (పొగతోట): స్వయం సహాయక గ్రూపు మహిళలు అన్ని రంగాల్లో రాణించేలా అవసరమైన చర్యలు చేపట్టాలని డీఆర్డీఏ పీడీ నాగరాజకుమారి సూచించారు. నగరంలోని డీఆర్డీఏ సమావేశ మందిరంలో కమ్యూనిటీ బేస్డ్ ఆర్గనైజేషన్ పరిపాలన, నాయకత్వంపై ఏపీఎంలు, సీసీలకు శిక్షణ కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు.

ఆస్పత్రుల్లో తనిఖీలు

నెల్లూరు(అర్బన్): నగరంలోని క్రాంతినగర్, ఆర్టీఏ కార్యాలయ సమీపంలోని అర్బన్ హెల్త్ సెంటర్లను ఏడీఎంహెచ్‌ఓ ఖాదర్‌వలీ ఆకస్మికంగా శుక్రవారం తనిఖీ చేశారు. లెప్రసీ వైద్యాధికారి సురేంద్రబాబు, ఫిజియోథెరపిస్ట్ నరసింహులు, డీపీఎంఓ రమణారెడ్డి, ఆచారి, టీబీ నివారణ సిబ్బంది వేణు, వినయ్, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

పోలీస్‌స్టేషన్ వద్ద ఆందోళన

నెల్లూరు(క్రైమ్): కులం పేరుతో దూషించి దాడికి పాల్పడిన వారిపై అట్రాసిటీ కేసు నమోదు చేయాలని బాధితురాలు కామాక్షి కోరారు. దాడి ఘటనపై ఫిర్యాదు చేసినా కేసు నమోదు చేయడంలో పోలీసులు జాప్యం చేస్తున్నారని ఆరోపిస్తూ ఆమె, తన బంధువులు, కుటుంబసభ్యులతో కలిసి వేదాయపాళెం పోలీస్‌స్టేషన్ ఎదుట ఆందోళనను శుక్రవారం చేపట్టారు. కాగా దర్గామిట్ట ఇన్‌స్పెక్టర్ రోశయ్య ఘటన స్థలానికి చేరుకున్నారు. విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి తగు చర్యలు చేపడతామని హామీ ఇవ్వడంతో వారు వెనుదిరిగారు.

ఆరోగ్యవంతమైన సమాజానికి పీఎంపీల తోడ్పాటు

నెల్లూరు(అర్బన్): అతి తక్కువ ఖర్చుతో పేదలకు వైద్యసేవలందిస్తూ ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణానికి పీఎంపీలు ఎంతో కృషి చేస్తున్నారని కమిషనర్ సూర్యతేజ పేర్కొన్నారు. ఆర్టీసీ బస్టాండ్ సమీపంలోని దేవిశెట్టి స్వాములు రాజేశ్వరి కల్యాణ మండపంలో శుక్రవారం నిర్వహించిన పీఎంపీ దినోత్సవానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన మాట్లాడారు. ప్రాథమిక వైద్యసేవలందిస్తూ మంచి పేరు తెచ్చుకోవడాన్ని అభినందించారు. అనంతరం న్యూరో, ఆర్థో, జనరల్, గుండె తదితర విభాగాల్లో వచ్చిన నూతన వైద్యవిధానాలపై పీఎంపీలకు అవగాహన కల్పించారు. ఉచితంగా నిర్వహించే కేన్సర్ పరీక్షలు చేయించుకోవాలని రూపొందించిన పోస్టర్లను ఆవిష్కరించారు. 70 ఏళ్లు నిండిన పీఎంపీలను సత్కరించారు. పీఎంపీ జిల్లా అధ్యక్షుడు శాఖవరపు వేణుగోపాల్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో నెల్లూరు రూరల్ డీఎస్పీ శ్రీనివాసరావు, నారాయణ మెడికల్ గ్రూప్ ఏజీఎం చౌకచర్ల భాస్కర్‌రెడ్డి, సంఘ కార్యదర్శి గోరంట్ల శేషయ్య, జిల్లా నేతలు దేవరకొండ శ్రీనివాసులు, ప్రసాద్, రామదాసు, వీరయ్య, మాలిని, జయప్రకాష్, రమాదేవి తదితరులు పాల్గొన్నారు.

వేగవంతంగా స్మార్ట్ స్ట్రీట్ బజార్ పనులు

నెల్లూరు(బారకాసు): వీధి వ్యాపారుల ఆర్థికాభ్యున్నతి కోసం పైలట్ ప్రాజెక్ట్ కింద చేపడుతున్న స్మార్ట్ స్ట్రీట్ బజార్ పనులను వేగవంతం చేసి త్వరలో అందుబాటులోకి తీసుకురావాలని కమిషనర్ సూర్యతేజ ఆదేశించారు. కార్పొరేషన్ కార్యాలయంలోని తన చాంబర్‌లో శుక్రవారం నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. విద్యుత్ సంబంధిత పనులను పూర్తి చేయాలని సూచించారు. నిర్మాణ సామగ్రి పర్యవేక్షణ, చోరీలు జరగకుండా సీసీ కెమెరాలను ఏర్పాటు చేయాలని కోరారు. స్మార్ట్ స్ట్రీట్ బజార్ ఏర్పాటుకు వచ్చిన దరఖాస్తుల వివరాలను ఆరాతీశారు. నగరంలోని ప్రతి స్తంభానికీ వీధి దీపాలను ఏర్పాటు చేయాలని తెలిపారు. కూడళ్ల వద్ద అవసరమైన చోట విద్యుత్ కాంతి పెంచేందుకు లైట్లను మార్చాలని చెప్పారు. ఎస్‌ఈ రామ్మోహన్‌రావు, ఈఈ రహంతుజానీ, డీఈ రఘురామ్ తదితరులు పాల్గొన్నారు.

మర్యాదపూర్వకంగా..

నెల్లూరు(వీఆర్సీసెంటర్): ఎస్పీడీసీఎల్ చీఫ్ విజిలెన్స్ ఆఫీసర్ జనార్దననాయుడ్ని జిల్లా సర్కిల్ ఎస్‌ఈ విజయన్ మర్యాదపూర్వకంగా శుక్రవారం కలిశారు. డీఈఈ అశోక్, మునీంద్ర, విజిలెన్స్ ఎస్సై పుల్లారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పదోన్నతుల్లో అన్యాయం

నెల్లూరు(వీఆర్సీసెంటర్): విద్యుత్ సంస్థల్లో పదోన్నతుల్లో రిజర్వేషన్ల కారణంగా ప్రతిభ గల ఓసీ, బీసీ, మైనార్టీ ఉద్యోగులు అనేక ఇబ్బందులు పడుతున్నారని ఎలక్ట్రిసిటీ ఓసీ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్ పేర్కొన్నారు. నగరంలోని చెరుకుపల్లి పిచ్చిరెడ్డి కల్యాణ మండపంలో అసోసియేషన్ వార్షికోత్సవాన్ని శుక్రవారం నిర్వహించారు. అనంతరం డైరీ, క్యాలెండర్లను నెల్లూరు రూరల్, సర్వేపల్లి ఎమ్మెల్యేలు కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి చేతుల మీదుగా ఆవిష్కరించారు. రాష్ట్ర అధ్యక్షుడు శ్రీధర్‌వర్మ అధ్యక్షత వహించిన కార్యక్రమంలో అసోసియేషన్ జాతీయ అధ్యక్షులు నాగరాజు, కరుణాకర్‌రెడ్డి, జనరల్ సెక్రటరీ సతీష్, ఎస్పీడీసీఎల్ జిల్లా సర్కిల్ ఎస్‌ఈ విజయన్, నేతలు వాసుదేవరెడ్డి, సోమశేఖర్‌రెడ్డి, రామకృష్ణ, శ్రీనివాసులు మునిశేఖర్, పెంచలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

మన్మోహన్‌సింగ్‌కు నివాళులు

నెల్లూరు(వీఆర్సీసెంటర్): మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్‌కు కాంగ్రెస్ నేతలు నివాళులర్పించారు. నగరంలోని ఇందిరాభవన్‌లో ఆయన చిత్రపటానికి పూలమాల వేశారు. డీసీసీ ఉపాధ్యక్షుడు తలారి బాలసుధాకర్, మోహన్‌రెడ్డి, అల్లావుద్దీన్, మల్లికార్జునరెడ్డి, సుధీర్, గణేష్, కిశోర్, సుధాకర్‌రెడ్డి తదితరులు, పాల్గొన్నారు.

నెల్లూరు(బృందావనం): మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్‌కు బ్రాహ్మణవీధికి చెందిన కళాకారుడు గంధవళ్ల ఉమాశంకర్ కళాత్మకంగా నివాళులర్పించారు. మర్రి ఆకుపై ఆయన చిత్రాన్ని తీర్చిదిద్దారు.

కనులపండువగా అయ్యప్పస్వామి నగరోత్సవం

నెల్లూరు(బృందావనం): అయ్యప్పస్వామి నగరోత్సవాన్ని నేత్రపర్వంగా శుక్రవారం నిర్వహించారు. నవాబుపేటలోని భ్రమరాంబ సమేత మల్లేశ్వర స్వామి దేవస్థానం నుంచి వేదాయపాళెంలోని అయ్యప్ప దేవస్థానం వరకు నగరోత్సవం సాగింది. అయ్యప్ప సేవా సమాజ అధ్యక్ష, కార్యదర్శులు గూడల శేషగిరిరావు, కత్తుల వెంకటరత్నం, గడ్డం రత్నయ్య, కత్తి మోహన్‌రావు, గడ్డం విజయకుమార్, పావళ్ల ప్రసాద్ తదితరులు పర్యవేక్షించారు.

5 నుంచి క్యారమ్స్ పోటీలు

నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట): జాతీయ స్థాయి క్యారమ్స్ పోటీలను నగరంలో జనవరి ఐదు నుంచి నిర్వహించనున్నామని క్యారమ్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు చిలకల శ్రీమన్నారాయణ పేర్కొన్నారు. ఈ మేరకు నెల్లూరు క్లబ్‌లో విలేకరుల సమావేశాన్ని శుక్రవారం నిర్వహించారు.

కేసు నమోదుకు వినతి

నెల్లూరు (టౌన్): నగరంలోని వీఆర్ లా కళాశాలలో విద్యార్థినిపై వేధింపులకు పాల్పడిన వారిపై క్రిమినల్ కేసు నమోదు చేయాలని ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా అధ్యక్షుడు నరేంద్ర శుక్రవారం ఒక ప్రకటనలో కోరారు. కళాశాలలో ఫైనలియర్ చదువుతూ ఓ విద్యార్థి సంఘ నేతలుగా చెప్పుకొంటూ విద్యార్థినిని వేధిస్తున్నారని ఆరోపించారు. ఈ విషయమై ప్రిన్సిపల్‌కు సదరు విద్యార్థిని ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని చెప్పారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు.

బాలలకు పౌష్టికాహారం పంపిణీ

నెల్లూరు(బృందావనం): కొండాయపాళెం రోడ్డులోని అబైడింగ్ హోప్ ట్రస్ట్ కార్యాలయంలో బాలబాలికలకు పౌష్టికాహారం.. పేదలు, వృద్ధులు, దివ్యాంగులకు అన్నదానాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ట్రస్ట్ డైరెక్టర్ టైటస్ నిర్మల్‌కుమార్ మాట్లాడారు. అబైడింగ్ హోప్ ట్రస్ట్, పబ్లిక్ రిలేషన్స్ ఆఫ్ ఇండియా, అమరావతి చాప్టర్ సౌజన్యంతో కార్యక్రమాన్ని నిర్వహించామని చెప్పారు. అనంతరం బాలబాలికలకు నిర్వహించిన పోటీల్లో విజేతలకు బహుమతులను అందజేశారు. నారాయణ మెడికల్ కళాశాల ప్రొఫెసర్ కణ్ణన్, ప్రవాస భారతీయుడు జోషువా, క్రాంతి విలియమ్స్, డేవిడ్ లివింగ్‌స్టన్, జయప్రకాష్, రూత్‌బినోమీ, మరియమ్మ, బాబు, సిస్టర్ మాగి, సిస్టర్ జయ తదితరులు పాల్గొన్నారు.

వేర్వేరు ప్రాంతాల్లో ఇద్దరి అదృశ్యం

నెల్లూరు(క్రైమ్): నగరంలోని వేర్వేరు ప్రాంతాల్లో ఇద్దరు అదృశ్యమైన ఘటనలపై పోలీసులు కేసులు నమోదు చేశారు. వివరాలు.. కిసాన్‌నగర్‌కు చెందిన మోహిత్ తిరుపతిలోని ఓ ప్రైవేట్ కళాశాలలో ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరం చదువుతున్నారు. ఈ నెల మొదట్లో కళాశాల నుంచి ఇంటికొచ్చారు. అనంతరం ఈ నెల నాలుగున ఇంటి నుంచి బయటకెళ్లిన మోహిత్ అదృశ్యమయ్యారు. గాలింపు చర్యలు చేపట్టినా ప్రయోజనం లేకపోవడంతో నవాబుపేట పోలీసులకు తండ్రి ఫిర్యాదు చేశారు.

- స్కార్ఫ్ కొనుక్కొస్తానని చెప్పి ఇంటి నుంచి బయటకొచ్చిన బాలిక అదృశ్యమైంది. పోలీసుల సమాచారం మేరకు.. డైకస్‌రోడ్డులోని చేపల మార్కెట్ సమీపంలో నివాసం ఉంటున్న గయాజ్ కుమార్తె ఏడో తరగతి వరకు చదువుకొని ఇంట్లోనే ఉంటున్నారు. ఈ క్రమంలో స్కార్ఫ్‌ను కొనుగోలు చేసి వస్తానంటూ తన పిన్నితో కలిసి దుకాణానికి గురువారం వెళ్లారు. అనంతరం అక్కడి నుంచి అదృశ్యమయ్యారు. గాలింపు చర్యలు చేపట్టినా ప్రయోజనం లేకపోవడంతో చిన్నబజార్ పోలీసులకు తండ్రి ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

కాకాణితో ఆదాల భేటీ

నెల్లూరు(బారకాసు): మాజీ మంత్రి, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు కాకాణి గోవర్ధన్‌రెడ్డితో మాజీ ఎంపీ, పార్టీ నెల్లూరు పార్లమెంట్ నియోజకవర్గ పరిశీలకుడు ఆదాల ప్రభాకర్‌రెడ్డి శుక్రవారం భేటీ అయ్యారు. నగరంలోని పార్టీ జిల్లా కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో విజయ డెయిరీ చైర్మన్ కొండ్రెడ్డి రంగారెడ్డి, పార్టీ నేతలు స్వర్ణా వెంకయ్య, పాశం శ్రీనివాస్, మల్లు సుధాకర్‌రెడ్డి, హరిబాబుయాదవ్, మంగళపూడి శ్రీకాంత్‌రెడ్డి, స్వర్ణా జీవన్‌ప్రసాద్, హంషీద్ అలీ, కొండేటి నరసింహరావు, కల్లూరు లక్ష్మీరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

లూయీ పాశ్చర్ జయంతి

నెల్లూరు(అర్బన్): మద్రాస్ బస్టాండ్ సమీపంలోని ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీకి చెందిన యాంటీ రేబిస్ వ్యాక్సిన్ క్లినిక్‌లో లూయీ పాశ్చర్ జయంతిని శుక్రవారం నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. క్లినిక్ కన్వీనర్ బిరదవోలు వెంకురెడ్డి, రెడ్‌క్రాస్ సెక్రటరీ మస్తానయ్య తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి సదరన్ ఇండియన్ సైన్స్ ఫెయిర్

నెల్లూరు (టౌన్): జిల్లాలోని అన్ని ప్రభుత్వ యాజమాన్య పాఠశాలల్లో సదరన్ ఇండియన్ సైన్స్ ఫెయిర్ 2024 – 25 విద్యా సంవత్సరానికి సంబంధించిన కాంపిటీషన్‌ను పాఠశాల స్థాయిలో శనివారం నిర్వహించాలని జిల్లా సైన్స్ అధికారి కరుణాకర్‌రెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. పోటీలను 8, 9, 10 తరగతి విద్యార్థులు, ఉపాధ్యాయులకు వ్యక్తిగత, గ్రూపు కేటగిరీ, ఉపాధ్యాయ విభాగంలో నిర్వహించాలన్నారు. ఈ మూడు గ్రూపుల నుంచి ఒక్కో ప్రాజెక్ట్‌ను మండల స్థాయికి ఎంపిక చేసి ఈ నెల 30న పోటీలను నిర్వహించాలన్నారు. ప్రతి మండలంలో ఒక్కో విభాగం నుంచి ఒక్కో ప్రాజెక్ట్‌ను ఎంపిక చేసి జిల్లా స్థాయిలో నిర్వహించే సైన్స్ ఎగ్జిబిషన్‌కు పంపాలని చెప్పారు. స్టోన్‌హౌస్‌పేటలోని ఆరెస్సార్ హైస్కూల్లో జిల్లా స్థాయి ఎగ్జిబిషన్‌ను వచ్చే నెల మూడున నిర్వహించనున్నామని వెల్లడించారు. ఫిజిక్స్, కెమిస్ట్రీ, మ్యాథ్స్, ఎర్త్ లేదా స్పేస్ సైన్స్, పర్యావరణ, సాంకేతిక, జీవశాస్త్రం, లేదా జీవ రసాయన శాస్త్రం, గణన శాస్త్ర థీమ్స్ నుంచి ప్రాజెక్ట్‌లను ప్రదర్శించాలని సూచించారు.

శానిటరీ ఇన్‌స్పెక్టర్ సస్పెన్షన్

నెల్లూరు(బారకాసు): శానిటరీ ఇన్‌స్పెక్టర్ కృపాకర్‌ను విధుల నుంచి సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులను కమిషనర్ సూర్యతేజ శుక్రవారం జారీ చేశారు. చిల్డ్రన్స్ పార్కు సమీపంలోని నివా హాస్పిటల్ పూర్తి స్థాయిలో ప్రారంభమై వైద్యసేవలను అందిస్తున్నా, ఆస్తి పన్నును విధించకపోవడాన్ని గత తనిఖీల్లో కమిషనర్ గుర్తించి భవన యజమానులకు నోటీసులను జారీ చేశారు. అప్పటి రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ కృపాకర్ సూచనల మేరకు తాము ఆస్తి పన్ను, ట్రేడ్ లైసెన్స్‌ను ఇప్పటి వరకు చెల్లించలేదని లిఖితపూర్వకంగా నిర్వాహకులు తెలియజేశారు. దీని ఆధారంగా సస్పెండ్ చేశారు. అప్పటి రెవెన్యూ అధికారులు శ్రీనివాసులు, రాజేశ్వరికి నోటీసులను అందజేసి వివరణ ఇవ్వాలని ఆదేశించారు.

పెద్ద దర్గా గంధ మహోత్సవం నేడు

నెల్లూరు(బృందావనం): చిన్నబజార్ మెయిన్ రోడ్డులోని నెల్లూరు పెద్ద దర్గా ఖాజాపీర్ బంధానవాజ్ గంధ మహోత్సవం శనివారం రాత్రి పది గంటలకు ప్రారంభంకానుందని పీఠాధిపతి బాబాసాహెబ్ బంధానవాజ్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. భక్తులు తరలిరావాలని కోరారు.

ఇరువర్గాల బైండోవర్

నెల్లూరు(క్రైమ్): నగరంలోని వీఆర్ లా కళాశాలలో ఇరువర్గాలు దాడులకు పాల్పడటంతో వీరిని చిన్నబజార్ పోలీసులు శుక్రవారం బైండోవర్ చేశారు. మరోమారు ఇలాంటి ఘటనలకు పాల్పడితే చర్యలు తప్పవని హెచ్చరించారు. విద్యార్థులతో సమావేశాలను క్రమం తప్పకుండా నిర్వహించనున్నామని పేర్కొన్నారు.

క్యాలెండర్ల ఆవిష్కరణ

నెల్లూరు(అర్బన్): నెల్లూరు జిల్లా యాదవ ఉద్యోగుల సొసైటీ క్యాలెండర్లను నగరంలోని మాజీ ఎమ్మెల్సీ బీద రవిచంద్రయాదవ్ కార్యాలయంలో శుక్రవారం ఆవిష్కరించారు. సొసైటీ ఫౌండర్, రాష్ట్ర అధ్యక్షుడు దామెనబోయిన వెంకటేశ్వర్లుయాదవ్, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ప్రసాద్, శ్రీనివాసులు, ఉప్పు కొండయ్య, శ్రీనివాసులుయాదవ్, బాలసుబ్రహ్మణ్యం, వెంకటేశ్వర్లు, రంగ దొరబాబు, ప్రసాద్, గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

తక్కువ సర్వీస్ చార్జీతో ఫుడ్ డెలివరీ యాప్

నెల్లూరు(బృందావనం): సింహపురి వినియోగదారులకు తక్కువ సర్వీస్ చార్జీకే ఆహారాన్ని అందించేందుకు పొకెటో ఫుడ్ డెలివరీ యాప్‌ను రూపొందించారని హోటల్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు అమరావతి కృష్ణారెడ్డి పేర్కొన్నారు. హేమచంద్ర రూపొందించిన యాప్‌ను చిల్డ్రన్స్‌పార్క్ రోడ్డులోని సితార కాన్ఫరెన్స్ హాల్లో జిల్లా హోటల్స్ అసోసియేషన్ ప్రతినిధులతో కలిసి శుక్రవారం ఆయన ఆవిష్కరించారు.

పాఠశాలలను కాంప్లెక్స్‌లకే కేటాయించాలి

నెల్లూరు (టౌన్): మున్సిపల్ పాఠశాలలను మున్సిపల్ మేనేజ్‌మెంట్ కాంప్లెక్స్‌లకే కేటాయించాలని రిపబ్లిక్ టీచర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు ఖాజా రహంతుల్లా, ప్రధాన కార్యదర్శి కిరణ్ శుక్రవారం ఒక ప్రకటనలో కోరారు. ప్రస్తుతం చేపట్టిన రీఆర్గనైజేషన్‌లో కొన్ని పాఠశాలలను ఇతర మేనేజ్‌మెంట్లలోని కాంప్లెక్స్‌లకు కేటాయించారని చెప్పారు.

సర్వీస్ ప్రొవైడర్ల ఎంపికకు దరఖాస్తుల ఆహ్వానం

నెల్లూరు(బారకాసు): నెల్లూరు కార్పొరేషన్‌తో పాటు కావలి, కందుకూరు, ఆత్మకూరు, బుచ్చిరెడ్డిపాళెం మున్సిపాలిటీల పరిధిలో ప్లంబర్, కార్పెంటర్, ఎలక్ట్రీషియన్, ఏసీ, గీజర్, టీవీ, రిఫ్రిజిరేటర్, వాషింగ్ మెషీన్ తదితరాలను రిపేర్ చేసే వారితో పాటు బ్యూటీషియన్, బార్బర్ తదితరుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నామని మెప్మా పీడీ రాధమ్మ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎన్సెస్డీసీ, ఎస్డీసీ, ఎన్‌ఏసీల ద్వారా నైపుణాభివృద్ధి శిక్షణ ఇచ్చి సర్టిఫికెట్‌తో పాటు అర్హత పొందిన వారికి హోమ్ ట్రయాంగిల్ ఆన్‌లైన్ ప్లాట్‌ఫాం ద్వారా జీవనోపాధిని కల్పించనున్నామని వివరించారు. ఆసక్తి గల వారు నెల్లూరు మున్సిపల్ కార్పొరేషన్‌తో పాటు ఆయా మున్సిపాల్టీలు, మెప్మా కార్యాలయాల్లో తమ వివరాలను ఈ నెలాఖరులోపు నమోదు చేసుకోవాలని కోరారు. అన్ని మున్సిపాల్టీల్లో సర్వీస్ ప్రొవైడర్స్ రిజిస్ట్రేషన్ మేళాను జనవరి 1, 7వ తేదీల్లో నిర్వహించనున్నామని వివరించారు. అర్హులు తమ రేషన్, ఆధార్, పాన్ కార్డులతో పాటు బ్యాంక్ పాస్‌బుక్, విద్యార్హత సర్టిఫికెట్ జిరాక్స్, రెండు ఫొటోలతో హాజరుకావాలని, వివరాలకు 79013 11585 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

డైరీ ఆవిష్కరణ

నెల్లూరు (పొగతోట): ఆంధ్రప్రదేశ్ అసోసియేషన్ ఆఫ్ సెక్రటేరియెట్ ఇంజినీర్స్ సంఘ డైరీని పంచాయతీరాజ్ ఎస్‌ఈ అశోక్‌కుమార్ ఆవిష్కరించారు. పంచాయతీరాజ్ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన కార్యక్రమంలో ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ సత్యనారాయణరెడ్డి, పీఆర్ డిప్లొమా ఇంజినీర్ల సంఘ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు సుమన, పీఆర్ ఇంజినీర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు బాబూరావు, ఇంజినీర్ల సంఘ జిల్లా అధ్యక్షుడు ఖాదర్‌మస్తాన్, పంచాయతీరాజ్ అసోసియేషన్ ఆఫ్ ఇంజినీర్ల సంఘ రాష్ట్ర నేత హరికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

అన్నప్రసాద వితరణ పరిశీలన

నెల్లూరు(బృందావనం): నగరంలోని రాజరాజేశ్వరి అమ్మవారి దేవస్థానంలో నిర్వహిస్తున్న అన్నప్రసాద వితరణ కార్యక్రమాన్ని ఈఓ, దేవదాయ శాఖ జిల్లా అధికారి కోవూరు జనార్దన్‌రెడ్డి శుక్రవారం పరిశీలించారు. భక్తులందరికీ అన్నప్రసాదం అందేలా ఏర్పాట్లు చేశారు.